జీజీహెచ్ ఆర్థోపెడిక్‌లో 24x7 సేవలు

- జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో రోగుల రాక
- పైసా ఖర్చు లేకుండా ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ అత్యాధునిక ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగిన వారికి గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవల్ని అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఎందరో లారీ డ్రైవర్లు, క్లీనర్లు, ఇతర వాహన చోదకులు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఇక్కడ చికిత్స పొందారు. ఆర్థోపెడిక్ వైద్యులు, సిబ్బంది పెద్ద మనస్సుతో వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కోలుకునేవరకు కుటుంబ సభ్యుల మాదిరిగా సేవలందించారు. దాతల సహాయంతో ఉచితంగా అంబులెన్సులు ఏర్పాటు చేసి వారి సొంత రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా రోడ్డు ప్రమాదాల్లో గాయపడి కాళ్లు చేతులు, నడుము విరిగిన వారికి తక్షణమే ఆపరేషన్లు చేసి నొప్పి నివారణతోపాటు, వారు సక్రమంగా నడిచేలా వైద్య సేవలు అందిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉండే మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్స్ అందుబాటులో ఉండటంతో ఆధునిక వైద్యసేవల్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నారు.

ప్రతి రోజూ 350 మందికి వైద్య సేవలు

ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ప్రతి రోజూ 350 మంది చికిత్సతో పాటు 10 మందికి ఎలక్టీవ్ ఆపరేషన్లు చేస్తున్నారు. అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో ప్రతి రోజూ తీవ్ర గాయాలతో వస్తున్న ఇద్దరికి అర్ధరాత్రి సమయంలో సైతం ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ విభాగంలోని 14వ నంబర్ గదిలో ఆర్థోపెడిక్ వైద్యసేవల్ని అందిస్తున్నారు. ఓపీలో పరీక్షల అనంతరం అడ్మిషన్లు అవసరమైన వారిని ఇన్‌పేషెంట్ విభాగంలోని 113 నంబర్ గదిలో అడ్మిట్ చేసుకుని వైద్యం అందిస్తున్నారు.


ఆధునిక ఆపరేషన్ థియేటర్


జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ వార్డు

పలు జిల్లాల బాధితులకు వైద్య సేవలు

గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రోగులు, రోడ్డు ప్రమాద బాధితులతో పాటుగా కృష్ణా, ప్రకాశం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన రోగులు చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పెద్ద ప్రమాదం జరిగినా మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కే బాధితుల్ని తరలిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన రోగుల్ని సైతం అడ్మిట్ చేసుకుంటున్నారు. వారికి బంధువులు లేకపోయినా, వారి భాష రాకపోయినా బాధల్ని అర్థం చేసుకుంటూ మూడు నెలలపాటు సైతం వైద్య సేవల్ని అందిస్తూ మానవత్వాని చాటుకుంటున్నారు. ఇన్‌పేషెంట్ విభాగంలో 140 పడకలు ఉండగా ఒకసారి దానికి మించి రోగులు చికిత్స పొందుతున్నారు. కాలు లేదా చెయ్యి విరిగిన వారికి ఆపరేషన్ చేసిన పిదప వారు కోలుకోవడానికి నెలా లేదా రెండు నెలల సమయం పడుతుంది. రోగికి నయాపైసా ఖర్చులేకుండా పూర్తిగా కోలుకునే వరకు అన్ని వైద్యసేవలను ఉచితంగానే అందిస్తున్నారు.

కార్పొరేట్ దీటుగా వైద్య సేవలు



ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ఒక అసోసియేట్ ప్రొఫెసర్, పది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, నర్సింగ్ సిబ్బంది 24 గంటలూ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎలక్టీవ్ సర్జరీలతో పాటు ఎమర్జెన్సీ సైతం చేస్తున్నాం. ఉన్నతి ఫౌండేషన్ సహాయంతో వంద మందికి పైగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు సైతం విజయవంతంగా చేశాం. నేడు తుంటి మార్పిడి ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ యశస్వి రమణ, ఆర్థోపెడిక్ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

ఖరీదైన ఆపరేషన్ ఉచితంగా చేశారు



కోవిడ్ సోకి నా తుంటి అరిగిపోయింది. నడవలేక పోవడం, నిలబడలేక పోవడం వంటి సమస్యలతో గతనెల గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి వచ్చా. వైద్యులు పరీక్షలు చేసి అడ్మిట్ చేసుకున్నారు. సుమారు రూ. 2 లక్షలు ఖరీదు చేసే టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ ఉచితంగా చేశారు.

– వనమాల రమేష్, దేవరపల్లి, వల్లూరు మండలం, కృష్ణాజిల్లా

క్లుప్తంగా

ఆటపాటలతో కూడిన విద్యతో చిన్నారుల్లో ఉల్లాసం



నెహ్రూనగర్: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య ఎంతో అవసరమని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. సుద్దపల్లి డొంక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన్‌బాగీదారీ కార్యక్రమంలో భాగంగా తల్లులకు, చిన్నారులకు యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్య ద్వారా పిల్లలు మానసికంగా, ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలిమ, అంగన్‌వాడీ సిబ్బంది సుధ, విజయకుమారి, అరుణ, సాధిక పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ



గుంటూరు మెడికల్: రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రకళ, డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వైద్య కళాశాల విద్యార్థులు 131 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గుంటూరు జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేశారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదిలో నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని, తద్వారా ఎంతో మంది ప్రాణాలుకాపాడి ప్రాణదాతలుగా గుర్తుండిపోవచ్చని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ రక్తదానం ద్వారా నూతన ఉత్సాహం కలుగుతోందని, వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బండారు సుబ్బారావు, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. జీజీహెచ్‌కు ఎక్కువ సార్లు రక్తదానం చేసిన దాతలకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, కళాశాలల ప్రతినిధులకు వైద్య అధికారులు సన్మానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు



గుంటూరు రూరల్: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన జొన్నాడ సిద్ధార్థ(25) స్థానిక కేర్ డెంటల్ కాలేజీలో చదువుతున్నాడు. స్నేహితుడు దవ్వల సాయికృష్ణతో కలసి ద్విచక్ర వాహనంపై ఎన్‌హెచ్ 16 సర్వీస్ రోడ్డులో చిలకలూరిపేట వైపు వెళుతున్నారు. ఈ సమయంలో అటు వైపు నుంచే వస్తున్న ఆటోను పొత్తూరు వద్ద ఎదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో సిద్ధార్థ అక్కడిక్కడే మృతి చెందగా, గాయపడిన సాయిని 108లో జీజీహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. సిద్ధార్థ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన రామినేని శ్యామ్‌బాబు అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం ఎస్ఐకు అందింది. దీంతో బుధవారం రాత్రి సిబ్బందితో దాడి చేయగా, అతని వద్ద ఓల్డ్ టావెరన్ డీలక్స్ విస్కీ నాలుగు బాటిళ్లు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఎంఈవో-2 పోస్టుల భర్తీ నిర్ణయంపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో విద్యారంగ కార్యకలాపాల్ని పర్యవేక్షించడంలో ఎంతో కీలకమైన మండల విద్యాశాఖాధికారి పోస్టులకు అదనంగా ప్రతి మండలంలో రెండో ఎంఈవో పోస్టు భర్తీకి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.థామస్‌రెడ్డి, ఎస్. ప్రేమ్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ నిర్ణయంతో పాటు, సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకురావడం వంటి నిర్ణయాలతో ఉద్యోగులు తన కుటుంబ సభ్యులే అని సీఎం వైఎస్ జగన్ నిరూపించారని తెలిపారు. ఆయా నిర్ణయాలపై సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

18న బీజేపీ బహిరంగ సభ

గుంటూరు మెడికల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న తెనాలిలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ చెప్పారు. గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ తెనాలిలో జరిగే సభలో ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పాల్గొంటారని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు యడ్లపాటి స్వరూపరాణి, భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్య నాయుడు, జగ్గారపు శ్రీనివాస్, చరక కుమార్ గౌడ్, రాచుమల్లు భాస్కర్, గారపాటి పూర్ణచంద్రరావు, అప్పిశెట్టి రంగారావు, కొక్కెర శ్రీనివాసరావు, బండారుపల్లి రోశయ్య, ధారా అంబేడ్కర్, షేక్ గౌస్ మీరా, రఫీ పాల్గొన్నారు.

నగరంలో ఈ-ఆటోలు పరుగు

నెహ్రూనగర్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ-ఆటోల ద్వారా స్వచ్ఛ గుంటూరును సాధిద్దామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు నగరానికి ప్రభుత్వం కేటాయించిన 220 ఈ-ఆటోల్ని బుధవారం ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, ఆయా వార్డుల వారీగా స్థానిక కార్పొరేటర్లు ప్రారంభించి ప్రజారోగ్య కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ గుంటూరు సాకారానికిగానూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ నగరానికి అధిక సంఖ్యలో ఈ-ఆటోల్ని కేటాయించారని తెలిపారు. నగరంలోని 206 వార్డ్ సచివాలయాల పరిధిలో ఇక నుంచి వీటి ద్వారా ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుందని చెప్పారు. సేకరించిన వ్యర్థాల్ని నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గార్బేజ్ ట్రాన్స్‌స్టేషన్ (జీటీఎస్)లకు తరలిస్తారని వివరించారు. అక్కడ నుంచి పొడి, మిక్స్‌డ్ వ్యర్థాల్ని జిందాల్ ప్లాంటుకు, తడి వ్యర్థాల్ని నగరపాలక సంస్థ ప్రాసెసింగ్ సెంటర్లకు తరలిస్తారని పేర్కొన్నారు. ఈ-ఆటోల ద్వారా నగరపాలక సంస్థకు ఆయిల్ వినియోగంతో పాటు వాతావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ ఈ-ఆటోల ద్వారా కాలుష్యరహితంగా వ్యర్థాల్ని సమర్థవంతమైన విధానంలో ఇంటింటి సేకరణ చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. నగరంలోని ప్రతి సచివాలయానికి ఆటో అందుబాటులోకి రావడం వల్ల మెరుగైన పారిశుద్ధ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇంటితో పాటు పరిసరాల్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాల్ని రోడ్ల మీద వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల ఇన్‌చార్జులు, అధ్యక్షులు, ప్రజారోగ్య అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.


ఆటోలను ప్రారంభిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

ప్రజలకు ఇబ్బంది లేకుండా విస్తరణ చేపట్టాలి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణం అదనపు ప్లానింగ్ కార్యదర్శుల్ని ఏర్పాటు చేసుకొని పనుల్ని వేగంగా చేపట్టాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతారని చెప్పారు. విస్తరణ జరిగిన ప్రాంతాల్లో టీడీఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించకుండా మీడియా సంస్థలు బోర్డులు మీద యాడ్స్ పబ్లిష్ చేసుకుంటున్నాయని, బకాయిల వసూలుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలని చెప్పారు. బకాయిలు చెల్లించని సంస్థల బోర్డుల్ని వెంటనే తొలగించాలని సిటీప్లానర్‌కు స్పష్టం చేశారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీలు బాబూరావు, అజయ్ కుమార్, డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్‌లు, ఏఈలు పాల్గొన్నారు.


అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పట్నంబజారు: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ప్రైవేటు బస్సు యాజమాన్యాలు నిబంధనలకనుగుణంగా నడుచుకోవాలని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు సూచించారు. నగరంపాలెంలోని ఆయన కార్యాలయంలో బుధవారం ప్రైవేటు బస్సులు యజమానులు, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ ట్రావెల్స్ బస్సుల్ని మణిపురం ఓవర్ బ్రిడ్జి అవతల నిలుపుకోవాలని సూచించారు. నగరంలోకి వెళ్లాల్సి వస్తే రోడ్డుకు ఎడమవైపుగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఆపుకోవాలని సూచించారు. ట్రావెల్స్ కార్యాలయాల వద్ద సెక్యూరిటీ మార్గం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రోడ్లపై ఎక్కడ బడితే అక్కడ బస్సులు నిలుపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో వెస్ట్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్

ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కూరగాయలు, చేపల మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని పక్కకు తొలగించారు. రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ


పొత్తూరుపేట ప్రభుత్వ పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ షేక్ సజీల


కావటి శంకరరావు పాఠశాలలో కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ జ్యోతి పద్మజ

పట్నంబజారు: నగరంలోని పొత్తూరుపేట ప్రభుత్వ పాఠశాలలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విలువైన యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, షూస్‌లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాల్ని కల్పిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్ పాల్గొన్నారు.

14వ డివిజన్‌లో.....

నగరంలోని తూర్పు నియోజకవర్గం 14వ డివిజన్‌లో ఉన్న కావటి శంకరరావు నగరపాలక సంస్థ ప్రైమరీ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరి ఫాతిమా, స్థానిక కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చిదిద్దిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వేముల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు అబ్రహం, స్థానిక నేతలు శివన్నారాయణ, బసవేశ్వరరావు, జాని బాషా, శ్రీనివాసరెడ్డి, పాపారావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

పాత గుంటూరు: రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎ. శ్రావణ్‌బాబు తెలిపారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంపాలెంలోని ఇండియన్ రెడ్ క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్యం అధికసంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిల్లో సమయానికి రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు, యువత రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించి రక్తదాతల సంఖ్య పెంచేందుకు రెడ్‌క్రాస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అధినేత మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌ను ఆదర్శంగా తీసుకుని అన్ని సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బారావు, రెడ్‌క్రాస్ సభ్యులు సాయికృష్ణ శ్రీనివాస్, మట్టుపల్లి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రావణ్‌బాబు

ఆధునిక కిడ్నీ వైద్య సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు మెడికల్: జిల్లా ప్రజలకు అత్యాధునిక కిడ్నీ వైద్య సేవల్ని అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. గుంటూరు ఆటోనగర్‌లో విశిష్ట హాస్పిటల్స్‌ను ఉస్మానియా మెడికల్ కాలేజ్ యూరాలజీ మాజీ హెచ్ఓడీ డాక్టర్ ఎస్.జయరామిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ముఖ్య అతిథులుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలో విశేష అనుభవం గడించిన డాక్టర్ పువ్వాడ టి. రవిచందర్ నూతన హాస్పిటల్‌ను ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. నెఫ్రాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ వార్డులను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ డాక్టర్ రవిచందర్ పేద ప్రజలకు అతి తక్కువ ధరలో అత్యాధునిక వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. డాక్టర్ పువ్వాడ టి.రవిచందర్, డాక్టర్ ఎం.ఎస్.ఆర్.లక్ష్మీదీపిక మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని రకాల అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, డాక్టర్ నందకిషోర్, కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ జయరామిరెడ్డి. పక్కన ఎమ్మెల్యే గిరిధర్, డాక్టర్ రవిచందర్

నేడు ఇంటర్ ప్రతిభావంతులకు మాస్టర్‌మైండ్స్ పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగర పరిధిలోని వివిధ కళాశాలల నుంచి సీనియర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు బహూకరిస్తున్నట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లలో 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం సాయంత్రం 5.00 గంటలకు బ్రాడీపేట 4/11లోని వజ్రం హోటల్ పక్కన ఉన్న మాస్టర్‌మైండ్స్ బాలాజీ క్యాంపస్‌లో ప్రతిభా పురస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరుకాగోరు విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకుని, తల్లిదండ్రులతో పాటు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తమవెంట ఆధార్ కార్డు, టెన్త్ మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. పేర్లు నమోదుకు 9248722218, 7780390139 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అరవై మందికి మొబైల్ ఫోన్లు అప్పగింత



నగరంపాలెం: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వందలాది మందికి తిరిగి అప్పగించినట్లు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి సౌకర్యార్థం పోలీసులు వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరవై మంది బాధితులకు వారి మొబైల్ ఫోన్లను బుధవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో ఏఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరాల కిందట పోగొట్టుకున్న ఫోన్లు, ఇక దొరకవని ఆశలు వదిలేసుకున్న బాధితులకు తిరిగి అప్పగించడంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఫోన్లకు పోగొట్టుకున్నవారు వాట్సాప్ నంబర్ 8688831574కు 'హాయ్' అని మెసేజ్‌ను పంపించాలని చెప్పారు.

అకౌంట్‌లో నగదు విత్‌డ్రాపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బ్యాంకు అకౌంట్‌లో నగదు డ్రా అయిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన డి.రమణారెడ్డికి మిర్చి యార్డు ప్రాంతంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఈనెల మొదటి వారంలో పలుమార్లు రమణారెడ్డి అకౌంట్‌లో రూ. 40వేలు విత్‌డ్రా అయ్యాయి. ఆలస్యంగా గుర్తించిన రమణారెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 1వ లైనులో సుమారు 45 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, మార్చురీకి తరలించారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8668881615కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.